# కాదు సరస్వతి : కాని కోమలి కదా!

## (చదువుల రాణులకొక ఉపాఖ్యానం)

రిటైర్డ్ జడ్జి రామలింగం నాయుడు త్యాగరాయనగరంలో ఓ లక్షరూపాయల భవంతిలో ఉంటున్నాడు. అతడి దగ్గర ఒపాత స్నేహితుడి కొడుకు గిరి పెరుగుతున్నాడు. వాడు పెద్దవాడయేసరికి ఓ చిత్రకారుడిగా తయారయేడు. వీడొక్కడే కాదు - నాయుడి దగ్గర కమల అన్న ఓ వేలు విడిచిన మేనత్త మనవరాలొకర్తె ఉంది. మానవుడు కష్టాలకోసమే పుట్టేడంటారు పెద్దలు - వాళ్ళని కాదనడం ఎందుకని నాయుడు స్వతహాగా తనకేమీ బాధ్యతలు లేక పోయినా ఈ ఇద్దరినీ కోరి తెచ్చుకున్నాడు.

ఇక గిరి, కమల నాయుడుగారి ఆస్తిని ఏ విధంగా సుఖంగా ఖర్చుపెట్టొచ్చో, అన్ని మార్గాల్నీ అన్వేషిస్తూ కాలక్షేపం చేస్తున్నారు. ఈ ముగ్గురితోనే, కథ జరుగుతే చప్పనయిపోదూ?

ముప్ఫై ఏళ్ళక్రితం, నాయుడు వయస్సులో ఉన్నప్పుడు అతడికో తమ్ముడుండేవాడు. ఆ తమ్ముడు ఇక్కడి పరిస్థితులతో తృప్తిపడక - దక్షిణాఫ్రికాలో మోక్షం ఉందని అక్కడికి పోయేడు. నాటినుంచీ నేటివరకూ ఆ తమ్ముడు భవనాలే కడుతున్నాడో, బొగ్గులే కొడుతున్నాడో, మరింకేం చేస్తున్నాడో నాయుడుకేమీ తెలిసి రాలేదు. అటువంటిది ఈనాడు హఠాత్తుగా ఆ తమ్ముడిదగ్గరనుంచి ఓ ఉత్తరం వచ్చిపడింది. దాని సారాంశం ఏమిటంటే -ఈ ముప్ఫై ఏళ్ళలో అతడు గడించినవి - రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితులు - ఓ పద్ధెనిమిదేళ్ళ కూతురు. అందుచేత తనకూతుర్ని బొంబాయి పంపిచేస్తున్నాడు. కనక తనపూజ్యులైన అన్నగారు ఇక మీదట ఆ పిల్లయొక్క సర్వస్వాన్ని స్వీకరించాలి, తను ఎలాగో తన రోజుల్ని గడిపేస్తాడు.

రామలింగం నాయుడు ఏకాంతంగా కూర్చుని ఒక్కసారి ఏడ్చేసాడు. బొంబాయి వెళ్ళి - కోమల్‌ను - అతడి తమ్ముడి అమ్మాయిని తీసుక వచ్చాడు. కోమల్ శరీరం ఎండతాకుడు చేత ఎర్రబారి ఉంది. ఆమెలో బద్ధకానికి అలవాటుపడ్డ శరీరంలోని నాజూకు లేదు. ఆమె దుస్తులు అపోహాదిరిగా ఉన్నాయి. చూడగానే అవి ఆకర్షణీయంగా కనిపించి వళ్ళుటికీ కొత్త చవకబారుగా స్ఫురిస్తాయి. ఏది ఎలా ఉన్నా, గిరి ఆమెను చూడగానే ఒక్కసారి కళ్ళప్పగించి "బ్రేవో" అనుకున్నాడు. ఆమెను తన యింటి వారికి పరిచయం చేసిన తర్వాత నాయుడు ఆమెతో అన్న మాటలు "అమ్మాయ్! నా యిల్లు మీనాన్న ఇంటిలానే భావించుకో" అని.

ఇక సాధారణంగా ఒక కథలో యిద్దరు అమ్మాయిలూ, ఒక అబ్బాయి ఉన్నా, లేక ఇద్దరు అబ్బాయిలూ ఒక అమ్మాయి ఉన్నా, లేక ఒక అమ్మాయి, ఓ అందమైన బీదఅబ్బాయి అంతగా అందంలేని మరో గొప్ప అబ్బాయి ఉన్నా చిన్న చిక్కులు రాకమానవు. కాని నా కథలో అటువంటి ప్రమాదాలేమీ లేవు.

ఒకనాడు ప్రొద్దున్న నాయుడు అప్పుడే కాఫీ, ఫలహారం ముగించి ఓ దినపత్రికని విప్పేడు. రానురాను నాయుడికి కోమల్ మీద ఓ ప్రత్యేక అభిమానం ఏర్పడుతూ వచ్చింది. ఆమె సంభాషణ, ఆమె నవ్వే నవ్వు, ఆమె నడిచేటప్పుడు ఊపే చేతుల విసురు—ఇవన్నీ అక్షరాలా తన తమ్ముడి ప్రతిబింబాలే అనుకుంటూండేవాడు.

దాసీమనిషి కోమల్‌కు ఓ చిన్న ఉత్తరం లాక్కువచ్చింది. "ఓపిల్లాడు దీన్ని తెచ్చాడు. దీని జవాబుకోసం కనిపెట్టుకున్నాడు" అంది.

వై. ఆర్. రావు

కోమల్ ఈలపాట పాడుకుంటూ రోడ్డువైపు చూస్తోంది. వెంటనే ఉత్తరాన్ని పాడుతూనే విప్పింది. గిరిరాసే ఉత్తరాల కవర్లు అన్నిటికీ ఎడంవైపు మూలలో ఓ బంగారురంగు గురు తుంటుంది. అందుచేత విప్పకముందే గిరి దగ్గరి నుంచి వచ్చిందని తెలుసు. ఉత్తరం విప్పిన తర్వాత ఓ నిముషం క్రిందామీదా దృష్టిని పోనిచ్చింది. తర్వాత తీక్షణంగా మొఖంపెట్టి కక్కయ్యదగ్గరకు వచ్చింది "కక్కయ్యా! గిరి చాలా మంచివాడు కదూ?"

"బాగుంది ఏం? చిన్నప్పటినుంచీ వాడు నా చేతుల్లోనే పెరిగాడు. మంచివాడు కాక ఏమవుతాడు?" అన్నాడు నాయుడు పత్రికని బల్లమీద పడేస్తూ.

"గిరి ఎవ్వరికీకూడా ఇతరులు చదవకూడని ఉత్తరాలు—అంటే మరేంలేదూ-ఊ-అటువంటి ఉత్తరాలు రాయడుకదూ?"

"హుం! బాగుంది. నే నింతవరకూ ఎరగను. అయితే ఇంతకీ...?"

"ఈ ఉత్తరం కొంచెం చదివి అది సవ్యంగా ఉందో లేదో చూడు కక్కయ్యా, మరేంలేదు నాకు ఈ దేశంవాళ్ల ఆచారాలూ, ఆచరణలూ కొంచెం కొత్తకదూ?"

నాయుడు పత్రికని జోరుగా పక్కకి తోసేసి గుడ్లెర్రచేసి ఉత్తరాన్ని విప్పేడు-ఒకసారి చదివేడు - రెండోసారి చదివేడు-మళ్ళీ మూడోసారి చదివేడు. "ఇదేమిటమ్మాయ్? నువ్వు నన్ను నిజంగా బేజారెత్తించేసేవ్! నాకు వాడి సంగతి బాగా తెలిసినా నే నూరికే కంగారుపడి చచ్చేను. వాడు నిన్ను "ఇవాళ మెరీనాకి వెళదాం! సాయంత్రం నాలుగు గంటలకి సిద్ధంగా ఉండగలవా?" అని రాసాడు. ఇందులో మరేం విపరీతమూ లేదే?"

"వెళితే బాగుంటుందా కక్కయ్యా?" అని అడిగింది కోమల్.

"వెళ్లమ్మా, వెళ్ళూ, దానికేం? అయినా నీ జాగ్రత్త నీ అడకువ, నాకు చాలా నచ్చేయి అమ్మాయ్! వెళ్లు-ఫరవాలేదు."

"మరేంలేదు కక్కయ్యా, నిన్నడుగుతే మంచిదని ... అయితే కక్కయ్యా, నువ్వు రావూ?"

"నేనా? నా కెందుకమ్మాయ్ బీచి షికార్లూ? నా క్లబ్బుకు నన్ను వెచ్చగా పోనీయ్."

"పోనీ, నువ్వొస్తావా కమలా?"

"నే నివాళ ఓ స్నేహితురాలింటికి వెళ్ళాలి."

వీళ్ళిద్దరి సంభాషణలోనూ, కమల అదోలా మొఖంపెట్టి ఏదో ఆలోచిస్తోంది. కోమల్ కుర్రాడి దగ్గరకి పరుగెత్తుక వెళ్ళి "ఆలాగే అని చెప్పు" అంది. నాయుడు హాల్లోంచి "ఓ చీటిముక్క రాసి పంపించకూడదా అమ్మాయ్?" అన్నాడు. "ఈమాత్రం దానికి చీటీ ఎందుకు కక్కయ్యా?" అని గదిలోకి పోయింది కోమల్.

ఇలాంటి మెరీనా షికార్లూ, సినిమా ప్రోగ్రాంలూ, చాలాచాలా అయేయి. కాని గిరికి, కోమల్ని ఆ ఒక్క మాట అడగటానికి ధైర్యం చాలడంలేదు.

కాలెండర్లో రెండుకాగితాలు చినిగేయి-రాత్రి తొమ్మిదిగంటల సమయం. కోమల్, నాయుడూ అప్పుడే సినిమాకి వెళ్లేరు. వాళ్లు వెళ్లిన పావుగంటకి కోమల్కి ఓ ఉత్తరం వచ్చింది. ఇప్పుడా ఉత్తరం కమల చేతులో ఉంది-కమల దీర్ఘంగా ఆలోచిస్తోంది. తనని కంగారుచేస్తున్న విషయం ఏమిటి? గిరి, కోమల్తో చాలా చనువుగా ఉంటున్నాడనా? కాదే? తనసలు ఈవిషయాన్ని ఎప్పుడూ లెక్క చెయ్యలేదూ-అయినామనస్సదోలాగుంది. రాత్రి 9 గంటలకి ఎందుకా ఉత్తరం వచ్చింది? అందులో-అదే-ఉంది. తప్పదు. కాని ఆ-అదే నిశ్చయం చేసుకోవాలని మనస్సు చాలా ఆరాట పడుతోంది. ఉత్తరం గిరినుంచి వచ్చింది. అది నిశ్చయం, ఎందుకంటే దాని కవరు ఎడమ కోణంలో ఆ బంగారు గుర్తుంది. ఉత్తరాన్ని ఎలక్ట్రిక్ దీపందగ్గరగా పెట్టి చాల జాగ్రత్తగా చూసింది - ఊహు-లాభం లేకపోయింది. ఒక అల్పీతో మెల్లిగా అంటించిన చోట గోలికింది. అబ్బే, అదీ లాభంలేక పోయింది. చికాకుతో బల్లమీదికి దానిని విసిరికొట్టి, ఒక బొమ్మల పత్రిక విప్పింది.

పదకొండున్నర కి నాయుడూ కోమల్ వచ్చేరు. నాయుడు అప్పుడే ప్రారంభించిన వానజల్లుకి సగం తడిసిన బట్టల్ని తిట్టుకుంటూ మేడమీదికి పోయేడు. కోమల్ తలకి కట్టిన మఫ్లర్ ని ఓ కుర్చీలో కూలబడి, విప్పడం మొదలుపెట్టింది.

కమల: "సరే కాని, కోమల్ నీకు తొమ్మిది గంటలకి ఓ ఉత్తరం వచ్చింది" అని తెలియ జేసింది కమల.

"ఎక్కడనుంచి?" అంది కోమల్ అద్దం వైపు చూసుకుంటూ.

"గిరిదగ్గరనుంచనుకుంటాను. ఉత్తరం మూలకి ఆ బంగారు గుర్తుంది. ఇదిగో" అంటూ కోమల్ ఆ ఉత్తరాన్ని విసరబోయింది.

కోమల్ చికాకుగా "ఏమిటలా నాకు రాస్తుంటాడూ? అబ్బ! వెధవ ముడి గట్టిపడి పోయింది. ఎంతకూ వచ్చేటట్టు లేదు. కమలా, అదేదో నువ్వే కాస్త చదివేద్దూ. అబ్బబ్బబ్బ" అంటూ మఫ్లర్ తో తంటాలు పడుతోంది.

"అదేమిటి కోమల్? గిరి నీకు ఏకాంతంగా రాసిన ఉత్తరాన్ని నేనెలా చదువుతాను? బాగుంది నువ్వే చదువుకుందూ" అంది కమల.

"ఏమిటన్నావ్ ? ఇతరులు చదవకూడని ఉత్తరాలు నాకెప్పుడూ రావులే! చదివేస్తూ, ఏం ఫరవాలేదు" అంది కోమల్ తలైనా తిప్ప కుండా.

కమల ఇక తప్పని సరి అన్నట్టు ఉత్తరం చించి లోనికాగితాల్ని విప్పుతూ "నువ్వంతగా చదవమంటున్నావ్ కాబట్టి చదువుతానులే" అంది. కాగితాన్ని రెండుమూడు సార్లు చూసింది. ఒకసారి తలని కోమల్ వైపు తిప్పింది. కోమల్ కి ఆ ధ్యాసేలేదు. ఆమె ప్రస్తుతం రుమాల్ ని విప్పడమే తన ముఖ్యమైన బాధ్యతగా ఎంచి, ఉత్తరంతో తనకించుమించు పనే లేనట్టు ముఖంపెట్టింది. ఓ ఇరవై సెకండ్లు కమల కోమల్ వైపు నిదానించి చూసింది. తర్వాత కళ్లు కొంచెం చిన్నవిచేసి, నోరు మెల్లిగావిప్పి, ఓచిన్న నవ్వు తమాషాగానవ్వింది.

కమల కొంచెం తటపటాయించి "నువ్వు నన్నిలా ఈఉత్తరాన్ని చదవమనడంలో చాలా పొరపాటుచేసేవ్ కోమల్! ఆ ఉత్తరంలో ఏమని ఉందంటే "మై డియరెస్ట్ కోమల్! నా గదికి ఈరాత్రి 12 గంటలకి నువ్వు రావాలి. తప్పవద్దు" అని. ఇది వినగానే కోమల్ ముఖంలో మరి నెత్తురుచుక్క లేదు. కమల సానుభూతితో, "అసలు గిరి ఇలాగెప్పుడూ రాయలేదు. ఇందులో ఏదో పొరబాటు జరిగి ఉంటుంది. మరోలా అనుకోకు. నేనిది చదవ లేదే అనుకో. సరే. నేనుపోయి పడుకుంటాను" అంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది.

కోమల్ మెల్లిగా హాలులోకి వెళ్ళింది. కమల మేడమీద తన గదితలుపు వేసుకోగానే అయినశబ్దాన్ని వింది. గడియారాన్ని చూసింది. పన్నెండుకి ఇంకా పది నిముషాలు ఉన్నాయి. వెంటనే వీధితలుపుకి తాళంవేసి వర్షపుజల్లులో పరుగెత్తడం మొదలుపెట్టింది.

గిరి గది వాళ్ళింటికి ఒక అరమైలు దూరం ఉంటుంది. ఆ అర్ధరాత్రి నిశ్శబ్దంలో బంగాళా అంతటిలోనూ గిరి గదిలోని దీపం ఒక్కటే వెలుగుతోంది. కోమల్ నౌకరుతో చెప్పి గిరి గది చేరుకుని తలుపుతట్టింది. ఓ నిముషానికి గిరి తలుపు తీసేడు. గదికి మధ్యగా ఓ పూర్తి కాని చిత్రంఉంది. ఎదురుగా బల్లమీద అన్నీ చిందరవందరగా పడిఉన్నాయి. గిరి చేతికి ఓ ఆకుపచ్చని రంగు అంటిఉంది. చేతిలో ఓ కుంచె ఉంది. తలుపు తియ్యగానే పూర్తిగా తడిసి, వణికిపోతున్న కోమల్ ని చూసేడు. గిరి చేతిలోని కుంచె జారిపోయింది. "అరె! ఇంత అర్ధరాత్రి ఈ వర్షంలో ఇలా తడుస్తూ ఎందు కొచ్చేసేవ్?" అన్నాడు కంగారుపడుతూ.

కోమల్ చాలా సిగ్గుపడ్డది. "మరి నువ్వు రమ్మని ఉత్తరం రాసేవుగా?" అంటూ "మరి నీ ఆజ్ఞకి తిరుగుందా? "అంది కొంటెగా. ఈసారి గిరి నోట్లో సిగరెట్ కూడా జారి నేలమీద పడింది.

"నేనా? నిన్నిక్కడికి రమ్మని రాసేనా? విచిత్రంగా ఉందే!" అన్నాడు గిరి.


"ఇదిగో నీ ఉత్తరం."

గిరి తన ఉత్తరాన్ని చూసుకున్నాడు. కోమల్ వైపు చూసేడు. కోమల్ సిగ్గుగా నవ్వుతోంది. "కోమల్ నన్ను క్షమించు. వ్రాసేవేళకు నాకా ధైర్యం ఎలావచ్చిందో

నేనిప్పటికీ చెప్పలేకపోతున్నాను. ఇవాళ ఎలాగైనా ఈ చిత్రాన్ని పూర్తిచెయ్యాలనే ధ్యాసలోపడి నీకు చాలా అన్యాయం చేసేను.'' గిరి క్షమాపణ వేడుకుంటూ ఏదో ఆలోచిస్తున్నాడు. ''నాకోసం - అర్ధరాత్రి-జడివానలో ఒంటరిగా — కోమల్, నేనిక ఊరుకోలేను'' అంటూ ఆమెను గట్టిగా కౌగిలించుకొని ''కోమల్-మనం పెళ్లిచేసుకుందాం''అన్నాడు. అతడి గుండెలో తలదాచుకున్న కోమల్ తల మీద రెండశ్రువులు పడ్డాయి.

తర్వాత కొన్నాళ్ళకి వాళ్ళ వివాహం యథావిధిగా జరిగిపోయింది. వివాహమైన కొన్నాళ్ళకి గిరి కోమల్‌తో ''ఆనాడు జడివానలో ఒంటరిగా నా గదికి వచ్చేవు జ్ఞాపకముందా?'' అన్నాడు. కోమల్ కళ్లెగరేసింది.

''మరి—ఆనాడు నేను రాసిన ఉత్తరం నువ్వు స్వయంగా చదివేవా? నిజంచెప్పు'' కోమల్ ముందు గాభరాపడ్డది. తర్వాత కొంచెం సిగ్గుతో ''నాకు చదువురాదు. ఆఫ్రికాలో ఎంతో డబ్బు ఉంటేనేకాని మనవాళ్లు చదవడం కష్టం. అంచేత ఆ ఉత్తరాన్ని కమలచేత యుక్తిగా చదివించేను'' అంది. గిరి ఒక్క ఐదు సెకండ్లు కళ్లు పెద్దవిగా కోమల్ వైపు చూసి ఇల్లల్లా దద్దరిల్లేటట్టు నవ్వడం మొదలుపెట్టేడు. ''అఘ్యో మై డియర్ కోమలా! నేనందులో ఏమనిరాసేనో తెలుసునా!'' రేపు తెల్లవారుఝామునే మనం బోటుషైరు వెళ్దామనుకున్నాం. మర్చిపోకుమీ'', అని రాసేను. అయితే కమలకి కూడా ఇంగ్లీషు చదవడం రాదని నీకు తెలీదూ?''



లండన్‌లో నివసిస్తున్న డాక్టర్ హింగోరానీ అనే భారతీయ వైద్యుడు అక్కడినుండి కొందరు ప్రసిద్ధులయిన కంటివైద్యులు, పత్రికా రచయితలు, గాయకులు - వీరిని వెంట తీసుకుని ప్రస్తుతం ఇండియా పర్యటిస్తున్నాడు. ఆశయం ఉభయ దేశాల మధ్య సుహృద్భావాన్ని పెంపొందింప చెయ్యడం. గతవారం యీ బృందం మద్రాసు వచ్చినప్పుడు తీసిన ఛాయాచిత్రం. అడుగు వరసలో ఎడమనుండి కుడికి డాక్టరు హింగోరానీ, మద్రాసు మేయరూ, హింగోరానీ సతీమణీ కానవగును.